క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ



నాగాయలంక: కార్తిక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు సాయికిరణ్ శర్మ ఆధ్వర్యంలో చిట్టా హరేకృష్ణ, వాణి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించారు. స్వామివారి ఎదుట భారీ కర్పూర జ్యోతి వెలిగించారు. కృష్ణానది తీరంలోని శ్రీరామ పాద క్షేత్రం మండపంలో శుక్రవారం రాత్రి రామలింగేశ్వరునికి నవ హారతులు సమర్పించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

ముంపు మళ్లింపు

మంగళాపురం(చల్లపల్లి):మంగళాపురం గ్రామంలోని రెండు వేల ఎకరాల్లో ముంపు నీరు మళ్లించేందుకు నాన్ నోటిఫైడ్ డ్రెయినేజీ పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సమస్యను వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు ఇటీవల పరిశీలించి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం పూడికతీత పనులు ప్రారంభించారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోసూరువారిపాలెం(మోపిదేవి):జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లోని రహదారులన్నీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచ్ కోసూరు అనూష అన్నారు. కోసూరువారిపాలెంలో రూ. 5.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, సనకా నాగమల్లేశ్వరరావు, గరికిపాటి రేణుకయ్య పాల్గొన్నారు.

నందీశ్వరునికి జలాభిషేకం

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలోని గంగా బాలా త్రిపుర సుందరి సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా 54 కలశాలతో స్వామి వారికి జలాభిషేకం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిగాయి.

నిత్యావసర సరుకుల అందజేత

మోపిదేవి: మోపిదేవిలో యానాదులకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి కట్ట బియ్యం, కిలో కంది పప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, లీటరు పామాయిల్ అందజేశారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టీఎంఆర్ బ్యాగులు

నాగాయలంక: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాల ఆధ్వర్యంలో పాడి రైతులకు టోటల్ మిక్స్‌డ్ రేషన్ (టీఎంఆర్) బ్యాగులను జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సాయి మౌనిక మాట్లాడుతూ పాడి పశువులలో మెరుగైన పాల ఉత్పత్తికి ఇది ఉపయోగపడుతుందన్నారు.

పంట రక్షణ చర్యల్లో నిమగ్నం

పెడన: మిచాంగ్ తుపానుకు ముంపునకు గురైన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు చర్యలు చేపట్టారు. వర్షం నీటిలో పూర్తిగా నానిపోయిన పంటను నిలబెట్టి కట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. తడిచిన పనలను బయటకు తీసుకువచ్చి నూర్చి ఆరబెట్టుకుంటున్నారు. మరికొందరు నూర్చకుండా ఆరబెట్టిన అనంతరం నూర్పిళ్లు చేయిస్తున్నారు.

ముమ్మరంగా పూడికతీత

అవనిగడ్డ: మిచాంగ్ తుపాను అనంతరం అవనిగడ్డతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేస్తున్నారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెయిన్లలో పూడికతీశారు. మురుగు ప్రాంతాల్లో వ్యాధుల బారిన పడకుండా బ్లీచింగ్ చల్లించారు. మోదుమూడి, అశ్వరావుపాలెం, వేకనూరు, పులిగడ్డ, దక్షిణ చిరువోలులంకలో జరిగిన పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్‌డీ శైలజ, ఈఓ తోట శ్రీనివాసరావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా పర్యవేక్షించారు.

వరించింది

- కంకులతో కళకళలాడుతున్న వరి పొలాలు
- బెట్ట చేలకు మేలు చేసిన 'మిచాంగ్'
- ఎండ గట్టడం వల్ల వరి దుబ్బులు పటిష్టం
- తుపానును ఎదుర్కొని అధిక దిగుబడులు
- 1.37 లక్షల ఎకరాల్లో నిలబడిన పంట



కోడూరు మండలం పిట్టల్లంకలో తుపానును తట్టుకుని నిలబడి ఉన్న వరి పొలం

అవనిగడ్డ: నాడు సాగునీటి కష్టాలు ఎదుర్కొన్న రైతులు నేడు సంతోషంతో ఉన్నారు. నెల రోజుల కిందట సక్రమంగా సాగునీందని పొలాలు నేడు మిచాంగ్ తుపానును తట్టుకుని నిలబడ్డాయి. బెట్ట పొలాలకు భారీ వర్షాలు మేలు చేశాయి. జిల్లాలో సుమారు 1,37,820 ఎకరాల్లో వరి పంట తుపానును తట్టుకుని నిలబడింది. ఈ పొలాల్లో గత ఏడాది కంటే అధికంగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

1.37 లక్షల ఎకరాలకు మేలు..

కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3,78,872 ఎకరాల్లో వరి సాగు చేశారు. మిచాంగ్ తుపానుకు 2,41,052 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాల నివేదికలు తెలియజేస్తున్నాయి. 1,37,820 ఎకరాల్లో వరి పంట తుపాను, ఈదురు గాలులను తట్టుకుని నిలబడింది. ముఖ్యంగా కోడూరు మండలంలోని పిట్టల్లంక, సాలెంపాలెం, వేణుగోపాలపురం, వి కొత్తపాలెం, మాచవరం, ఉల్లిపాలెం, మందపాకల, లింగారెడ్డిపాలెం, నాగాయలంక మండలంలోని మర్రిపాలెం, సంగేగడ్డ, భావదేవరపల్లి, బర్రంకుల, తలగడదీవి, గణపేశ్వరం, అవనిగడ్డ మండలంలోని వేకనూరు, తుంగలవారిపాలెం, మోదుమూడి, అశ్వరావుపాలెంలోని దిగువ ప్రాంత పొలాలు వర్షాభావ పరిస్థితుల వల్ల సక్రమంగా సాగునీందక బెట్టకొట్టగా మిచాంగ్ తుపాను మేలు చేసింది.

పంట పండింది..

నెలరోజుల కిందట వర్షాల లేక సాగు నీటి కోసం జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు నీరు పెట్టుకున్నవారు కొందరైతే, ఇంజిన్లు దొరక్క పొలాలను వదిలేసిన వారు ఇంకొందరు. ఇలా వారం పదిరోజుల పాటు వరి పొలాలను ఎండగట్టడం వల్ల కాండం వరి దుబ్బులు దృఢంగా మారాయి. వేరు వ్యవస్థ బలంగా మారింది. పొలాలు కూడా ఎక్కువ ఎత్తు పెరగలేదు. గత నెలలో కురిసిన వర్షాలకు ఈ పొలాలన్నీ జీవం పోసుకున్నాయి. ఈ పొలాల్లోని పంట బాగానే పండింది. ఈ కారణాలే మిచాంగ్ తుపాను నుంచి పంట పొలాలను రక్షించాయి. 100 నుంచి 120 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచినప్పటికీ ఎండగట్టిన పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

బాగున్న దిగుబడులు..

గత నెలలో కురిసిన వర్షాలకు పంట బాగుంది. గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి పెరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. నాడు సాగునీటి ఇబ్బందుల వల్ల పంటను చూసి ఆందోళన చెందిన రైతులు మిచాంగ్ తుపాను అనంతరం నిలబడిన పంటను చూసి ఆనంద పడుతున్నారు.

ఆందోళన చెందా



సరిగా వర్షాలు పడక పోవడం, వంతుల వారీ సాగునీటి సరఫరా వల్ల తీవ్ర ఆందోళన చెందా. గత నెలలో వర్షం పడిన తరువాత పంట కాలువల నుంచి సక్రమంగా సాగునీందడంతో పంట బాగుంది. నెల రోజుల కిందట పొలాన్ని ఎండగట్టడం వల్ల తుపానుకు పడకుండా తట్టుకుంది.

– తెనాలి రమణ, పిట్టల్లంక

ఎండగట్టడం వల్ల మేలు జరిగింది



నెలరోజుల కిందట పొలాలకు సాగునీరు పెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రాత్రిళ్లు కాపలా కాసినా నీరు పెట్టలేకపోయాం. ఈ సమయంలో వారం, పదిరోజుల పాటు పొలంలో చుక్కనీరు లేదు. దీంతో ఎత్తుపెరగక పోవడం వల్ల తుపాన్‌కు పడకుండా నిలబడి ఉంది.

–చిరివెళ్ల యానాదిరావు, పిట్టల్లంక

దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

మచిలీపట్నం టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం శుక్రవారం నగరంలోని బుట్టాయిపేట జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథి న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు చట్టపరమైన సేవలు అందించేందుకు తమ సంస్థ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. దివ్యాంగులకు సంబంధించిన ఏ కేసు వాదించేందుకైనా న్యాయవాదులను ఉచితంగా అందిస్తామని చెప్పారు. దివ్యాంగులు ఇంటి నుండే 15100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా తమ సమస్య తెలిపి సేవలను వినియోగించుకోవచ్చునన్నారు. దివ్యాంగులకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా తమ సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సలహాలను అందిస్తామని చెప్పారు. కోర్టు ద్వారా పరిష్కరించుకోవలసిన కేసులకు కూడా న్యాయవాదులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. కామరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు కావలసిన ఉపకరణాలను తమ కార్యాలయంలో ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు కార్యాలయానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు అల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ సదరం ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. నిజాయతీగా ధ్రువీకరణ పత్రాలను పొందాలని సూచించారు. రైల్వే పాసుల కోసం సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు ఇచ్చే పత్రాలు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి వి. హేమలత, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ నారాయణ, న్యాయవాదులు చీలి ముసలయ్య, అజ్మతున్నీసా, ఆర్ పేట ఎస్ఐ శ్రీనివాస్, దివ్యాంగుల సంఘం నాయకులు లక్ష్మణ్, నాగబాబు, శివశంకర్, కామేశ్వరరావు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను న్యాయమూర్తి రామకృష్ణయ్య అందజేశారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ వాణి

పెడన: మిచాంగ్ తుపానుకు చాలా మంది రైతులు నష్టపోయారని, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి వారికి పరిహారం అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్ష అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎవరైతే నష్టపోయారో వారి పంట పొలాలను గుర్తించి బాధిత రైతులకు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం విద్య, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, హౌసింగ్ తదితర శాఖలపై సమీక్షించారు. ఆడుదాం ఆంధ్రకు ఆసక్తి ఉన్న వారంతా గ్రామ సచివాలయాల్లో సంబంధిత వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఎంపీటీసీలను, సర్పంచులను కోరారు. సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు రాజుల పాటి అచ్యుతరావు, వైస్ ఎంపీపీలు యాదంరెడ్డి వరప్రసాద్, పరసా వాకాలమ్మ, వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, దావు భైరవలింగం, వెంకట రామానాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెరుచుకున్న సాగరతీరం గేట్లు

కోడూరు: మిచాంగ్ తుపాను కారణంగా మూతబడిన హంసలదీవి సాగరతీరం గేట్లు శుక్రవారం తెరుచుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరైన్ పోలీసులు, అటవీ అధికారులు పాలకాయతిప్ప కరకట్ట వద్ద బీచ్ గేట్ల తాళాలను తీసి పర్యాటకులను అనుమతించారు. సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, అలల ఉధృతి తగ్గిందని మెరైన్ సీఐ వల్లభనేని పవన్‌కిషోర్ తెలిపారు.

నాలుగున్నరేళ్లలో రూ. 23 కోట్లతో అభివృద్ధి

బంటుమిల్లి: బంటుమిల్లి-2 సచివాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో పలు పథకాల ద్వారా రూ. 23 కోట్లను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించిందని సర్పంచ్ వెంట్రప్రగడ కృష్ణవేణి అన్నారు. ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం సచివాలయం వద్ద నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం పార్టీ జండాను ఆవిష్కరించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, ఈఓపీఆర్‌డీ త్రిపుర సుందరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కృత్తివెన్ను: మిచాంగ్ తుపానుకు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని జెడ్పీటీసీ మైల రత్నకుమారి అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో శుక్రవారం మండలంలోని నిడమర్రు, పడతడిక, చినగొల్లపాలెం పంచాయతీల్లో నీట మునిగి దెబ్బతిన్న 450 ఎకరాల వేరుశనగ పంటను వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వేరుశనగతో పాటు, మినుము, వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని, రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, ఏఓ ఎస్. జెన్నీ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

గూడూరు: తుపాను ప్రభావంతో పంట పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోయేందుకు వీలుగా గూడూరు మండలంలోని పలు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు రెవెన్యూ, డ్రెయినేజీ, వ్యవసాయ శాఖాధికారులు సమన్వయంతో కాలువల్లో గుర్రపుడెక్క, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంటుమిల్లి: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఎం. రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంజులూరు, కంచడం, బర్రిపాడు, పెందుర్రు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

సెమీ క్రిస్మస్ కరపత్రాల ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మచిలీపట్నం మండలం సత్రవపాలెం సెంటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పాస్టర్లు ఆవిష్కరించారు.

కోదండ రామాలయం జీర్ణోద్ధరణకు భూమి పూజ



మచిలీపట్నంటౌన్: రాజుపేటలో 80 ఏళ్ల చారిత్రక కోదండ రామాలయం జీర్ణోద్ధరణకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) టెంకాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నూకల సురేష్, నూకల ప్రసాద్ దంపతులు, 37వ డివిజన్ కార్పొరేటర్ బినం తాతారావు, ఆలయ అర్చకుడు లక్కవజ్జల రామకృష్ణ శర్మ, భక్తులు పాల్గొన్నారు. విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ పర్యవేక్షించారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

కోనేరుసెంటర్: బందరు మండలం పోతేపల్లిలోని విజయ కోదండ రామచంద్ర స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. 100 మంది సతీసమేతంగా పాల్గొని సత్యనారాయణ వ్రత పూజను భక్తిశ్రద్ధలతో జరిపించారు.

వక్కలగడ్డలో వికసిత్ భారత్ సభ

వక్కలగడ్డ(చల్లపల్లి): వక్కలగడ్డ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్ సభ నిర్వహించారు. సర్పంచ్ వల్లూరు ఉమా అధ్యక్షతన సాంస్కృతిక ప్రదర్శన, అంగన్‌వాడీ స్టాల్ ప్రదర్శన, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 104 ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులకు జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది

పేర్ని కిట్టు



వర్షం నీటిలో నానుతున్న వేరుశనగ మొక్కలను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: తుపాను కారణంగా పంటలు కోల్పోయిన ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ విషయంలో ఏ ఒక్కరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ పొలాలను పరిశీలించారు. తుపాను కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించి బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. కిట్టు మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా రైతులకు దీనస్థితి ఏర్పడటం బాధ కలిగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు నష్టపోకుండా నష్ట పరిహారాన్ని అందజేస్తామని చెప్పారు. నష్ట పరిహారం అంచనాలో ఎవరికీ అన్యాయం జరగదన్నారు. నష్టపోయిన రైతుల జాబితాను సంబంధిత సిబ్బంది పారదర్శకంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. నష్టం అంచనాలు వేసే సమయంలో ఎవరికైనా అన్యాయం జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ విషయంలో గ్రామ స్థాయి నాయకులు, పెద్దలు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, మండల పార్టీ కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

మోపిదేవి: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, మోపిదేవికి చెందిన బట్టు సీతామహాలక్ష్మి (85), నాగాయితిప్పకు చెందిన గ్రీన్ అంబాసిడర్ నల్లూరి వెంకటేశ్వరరావు (60) గురువారం మృతిచెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బండికోళ్లంకకు చెందిన వాసుపల్లి నారాయణ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారివారి ఇళ్లకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు, మీసాల చిట్టిబాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మహేంద్రతో కలిసి వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి దోమలు అధికమై విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో వర్షం నీరు బయటకు పోయేలా చూడాలని సూచించారు. రానున్న పైడమ్మ సంబరాలలో దుకాణాల వేలం పాటలకు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరేశ్వరుడికి డ్రై ఫ్రూట్స్ అలంకరణ



నాగాయలంక: కార్తిక, బహుళ ఏకాదశి పర్వదినం, శుక్రవారం సందర్భంగా స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వర స్వామి ఆలయంలో నగరేశ్వరుడిని జీడిపప్పు, బాదం, కిస్‌మిస్, డేట్స్ తదితర డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో తొలుత నగరేశ్వరునికి 11 రుద్రములతో కూడిన పంచామృతాలు, వట్టి వేళ్లు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, మునగాల మోహనరావు, చిట్టా శివనాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర దీపాలంకరణ..

నాగాయలంక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి 7 గంటలకు సహస్ర దీపాలంకరణ ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.